నేరుగా మిల్లర్లకే విక్రయం

- పొదలకూరు మండలంలోని గ్రామాల్లో వరికోతలు
- కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే సవాలక్ష నిబంధనలు
- సిబ్బంది కొరత కూడా ఉంది
- కల్లాల్లోనే అమ్ముకుంటున్న రైతులు
- ఈసారి తగ్గిన దిగుబడి, ధరలు

పొదలకూరు మండలంలో వరికోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెలాఖరుకు 70 శాతం పూర్తయ్యే అకాశముంది. కూటమి ప్రభుత్వ తీరు కారణంగా ధాన్యాన్ని దళారులు, మిల్లర్లకు అమ్మేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మాలంటే సవాలక్ష నిబంధనలు ఉండటం.. ధాన్యాన్ని ఆరబెట్టే సౌకర్యం లేక మిల్లర్లకు నేరుగా విక్రయిస్తున్న పరిస్థితులున్నాయి.


ధాన్యాన్ని సేకరిస్తున్న దృశ్యం

పొదలకూరు: మండలంలో 14 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 60 శాతం కేఎస్ఎం 1638, 20 శాతం తెలంగాణ మసూరా, 10 శాతం బీపీటీ 5204, 10 శాతం ఎన్ఎల్ఆర్ 34449 రకం వేశారు. ఈ రబీలో సాగునీటి ఇబ్బందులు తలెత్తకపోవడంతో దిగుబడి బాగా వస్తుందని రైతులు ఆశించారు. అయితే దిగుబడి, ధరలు లేకుండా పోవడంతో ఢీలా పడ్డారు. ముందుగా వరినాటిన రైతులకు ఎకరానికి 2 నుంచి 2.50 పుట్లే ధాన్యం దిగుబడైంది. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్‌లో వరి నాటిన రైతులకు మాత్రం 3 నుంచి 3.50 పుట్లు ధాన్యం దిగుబడి అవుతున్నట్టు చెబుతున్నారు.

14 కేంద్రాల్లో..

మండలంలో రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల ఆధ్వర్యంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పొదలకూరు, మరుపూరు, వావింటపర్తి, తాటిపర్తి - 1, తాటిపర్తి - 2, నావూరు, మహ్మదాపురం, బిరదవోలు, సూరాయపాళెం, బత్తులపల్లి, దుగ్గుంట, నేదురుమల్లి, విరువూరు రైతుసేవా కేంద్రాలను పెట్టారు. ఇప్పటి వరకు తాటిపర్తి కొనుగోలు కేంద్రం ద్వారా 194 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు పంపడం జరిగిందని అధికారులు వెల్లడించారు. కాగా చాలా మంది రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా కాకుండా కల్లాల్లోనే ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు ఒక పుట్టిని రూ.18 వేల నుంచి రూ.18,500 వంతున అమ్మేస్తున్నారు. అయితే ప్రతి బస్తా (43 కేజీలు)కు రెండు కేజీల తరుగు అందజేస్తూ 45 కేజీల వంతున ఇస్తున్నారు.

షెడ్యూలింగ్ అయితేనే..

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముతామని షెడ్యూలింగ్ చేయించుకుంటేనే గోతాలు అందజేస్తారు. సంబంధిత రైతు వివరాలను మిల్లర్లకు పంపి వారి ద్వారా గోతాలను పంపిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. గతంలో గోతాలను కొనుగోలు కేంద్రాలకు పౌరసరఫరాల శాఖ ముందుగానే పంపి రైతులు అందజేసేది. ఇప్పుడున్న పద్ధతి వల్ల అన్నదాతలకు ఇబ్బందిగా ఉందని తెలుస్తోంది. మండలంలో 14 కొనుగోలు కేంద్రాలున్నా కోతలు ప్రారంభమైన గ్రామీణ ప్రాంతాల్లోనే ముందుగా ధాన్యాన్ని సేకరిస్తున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. సూరాయపాళెం, మహ్మదాపురం, తాటిపర్తి, నల్లపాళెం తదితర గ్రామాల్లో కోతలు మొదలైనందున తాటిపర్తి కొనుగోలు కేంద్రం ద్వారా షెడ్యూలింగ్ చేయిస్తున్నట్టు తెలిపారు. అయితే రైతులు మాత్రం గోతాల కొరత బాగా ఉందని, సవాలక్ష నిబంధనల వల్ల కల్లాల్లోనే విక్రయిస్తున్నారు. దీనికితోడు అన్ని కొనుగోలు కేంద్రాల్లో షెడ్యూలింగ్ చేయించాలంటే సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది.

గోతాల కొరత ఉంది



కొనుగోలు కేంద్రాల్లో గోతాల కొరత ఉంది. నిబంధనల ప్రకారం తేమశాతం చూపాలంటే ధాన్యాన్ని ఆరబెట్టి ఇవ్వాల్సి ఉంటుంది. రైతులకు అంత వెసులుబాటు లేకపోవడంతో కల్లాలోనే అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు. పుట్టికి 40 కేజీల తరుగు అందజేసి మిల్లర్లకు నేరుగా ఇస్తున్నాం.

– కె.రమణారెడ్డి, రైతు, మహ్మదాపురం

కోతలున్న చోటే కొనుగోలు



వరి కోతలున్న గ్రామీణ ప్రాంతాలకు అనుకూలంగా ఉన్న చోటే కొనుగోలు కేంద్రాలు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. తాటిపర్తి కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 194 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. సిబ్బంది కొరత కూడా ఉన్నందున ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

– కె.శివనాయక్, ఏడీఏ, పొదలకూరు


కోత పనులకు తరలివెళ్తున్న యంత్రాలు

క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



కొడవలూరు: కొడవలూరు పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలను ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా సోమవారం నిర్వహించారు. 16 మందికి రక్త పరీక్షలు చేయగా, ఇద్దరికి రక్తహీనత ఉందని గుర్తించి ఇంజెక్షన్లు ఇచ్చారు. అనంతరం వైద్యాధికారులు రామకృష్ణ, బాలచంద్రబాబు మాట్లాడారు. గర్భిణులు ప్రతి నెలా పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఏ షఫీవుద్దీన్, ఏఎన్‌ఎంలు శేషుబాయి, అనితకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు అర్జీలు అందాయని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు.

గ్లకోమాపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న శర్వాణి

నెల్లూరు(అర్బన్): గ్లకోమాపై అవగాహన పెంపొందించుకొని తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా అంధత్వ నివారణాధికారి శర్వాణి పేర్కొన్నారు. గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడారు. బీపీ, షుగర్ బాధితులు, 40 ఏళ్లు దాటినా, కుటుంబంలో ఎవరికైనా గతంలో గ్లకోమా వచ్చిన వారికి ఈ జబ్బు వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. 40 ఏళ్లు దాటిన వారు ఆర్నెల్లకోసారి గ్లకోమా పరీక్షను చేయించుకోవాలని కోరారు. వారోత్సవాలను అన్ని ఆస్పత్రుల్లో ఈ నెల 15 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. కాగా గతేడాది ఆగస్టు నుంచి చేపట్టిన స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా 524 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 1,05,525 మంది విద్యార్థులకు నేత్ర స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించగా, వీరిలో 4801 మందికి కళ్లద్దాలను అందజేశామని చెప్పారు.

బ్లాక్ ఫిల్మ్‌లపై కొనసాగుతున్న డ్రైవ్



నెల్లూరు (టౌన్): వాహనాలపై బ్లాక్ ఫిల్మ్, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్‌ను జిల్లాతో పాటు నగరంలో రవాణా శాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. 'అడిగే దమ్ముందా' అనే శీర్షికన సాక్షిలో కథనం ఇటీవల ప్రచురితమైంది. ఈ తరుణంలో డీటీసీ చందర్ ఆదేశాల మేరకు హరనాథపురం, రామలింగాపురం, చిల్డ్రన్స్‌పార్కు తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలను రవాణా శాఖ అధికారులు చేపట్టారు. బ్లాక్ ఫిల్మ్.. నిబంధనలను విరుద్ధంగా నంబర్ ప్లేట్లున్న 20 కార్లు, బైక్‌లపై కేసులు నమోదు చేశారు. కొన్ని కార్లకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను అక్కడే తొలగించారు. ఎమ్వీఐలు మహమ్మద్ రఫీ, కార్తీక్ పవన్, ఏఎమ్వీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసును సంతపేట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరులోని అంబాపురానికి చెందిన మురళీధర్ (65), దేవసేన దంపతులు. కుటుంబకలహాల నేపథ్యంలో తన కుమారుడ్ని తీసుకొని కొన్నేళ్ల క్రితం ఆమె వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. ఒంటరితనం ఆయన్ను కుంగదీసింది. ఈ క్రమంలో కొత్తహాల్ సమీపంలోని హరితా లాడ్జిలో గదిని శనివారం అద్దెకు తీసుకున్నారు. భార్యాపిల్లలకు దూరంగా ఉండటం, ఇతర సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఆయన తన వెంట తెచ్చుకున్న గడ్డి మందును తాగారు. అనంతరం జరిగిన విషయాన్ని తన స్నేహితులు వసంత్, చిట్టిబాబుకు తెలియజేశారు. లాడ్జి వద్దకు వారు చేరుకొని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో మురళీధర్‌ను చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి ఆయన మృతి చెందారు. సమాచారం అందుకున్న అక్కాచెల్లెళ్లు నెల్లూరు చేరుకొని మురళీధర్ మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి చెల్లెలు గోపీ నిర్మల.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రికి ఎస్సై సుల్తాన్‌బాషా చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రైతుల నుంచి వినతుల స్వీకరణ

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి తహసీల్దార్ సురేఖ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. భూములకు సంబంధించిన వాటితోపాటు, ఇతర సమస్యలపై ఆరు వినతులు అందినట్టు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సాయిప్రసాద్, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు ఏపీఎంలు మధుసూదన్‌రావు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల్లో నలుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 1,214 మందికి 1,132 మంది హాజరైనట్లు ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ మధుమతి తెలిపారు. గూడూరులోని ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నెల్లూరు నగరంలోని వీఆర్ ఐపీఎస్ కళాశాలలో ఇద్దరిని డిబార్ చేశారన్నారు.

387 మంది గైర్హాజరు

వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 387 మంది గైర్హాజరయ్యారని మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షలకు 64 మందికి గానూ 57 మంది హాజరై, ఏడుగురు గైర్హాజరయ్యారని వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 6,868 మందికి గానూ 6,488 మంది హాజరై, 380 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

కండలేరులో 50.815 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 50.815 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 780, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

కొనసాగుతున్న ప్రజా చైతన్య యాత్ర

కోవూరు: సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సోమవారంతో మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుమ్మళ్లదిబ్బలో పార్టీ నేత గండవరపు శేషయ్య మాట్లాడారు. గుమ్మళ్లదిబ్బ వద్ద కొత్తగా నిర్మించిన కాలనీలో ఇళ్ల నిర్మాణం పునాదులకే పరిమితమైందని ఆరోపించారు. బిల్లులు రాక.. ఇల్లు కట్టుకోలేక పేదలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నేతలు తిరువీధి రమేష్, పెద్దబ్బయ్య, అఫ్రోజ్, మల్లికార్జునరెడ్డి, సర్దార్ అహ్మద్, ఊటుకూరు రమణయ్య గండవరపు సురేష్, చాంద్‌బాషా, హరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త

పొదలకూరు: సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అని బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వూకోటి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆమె వర్ధంతిని పొదలకూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి బాలికా విద్యకు కృషి చేశారన్నారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చొప్పా వెంకటేశ్వర్లు, కోడూరు మస్తానయ్య, యు.మస్తానయ్య, బి.మురళి, మోహన్‌రావు, కండే వెంకటేశ్వర్లు, మాడా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పొదలకూరు: నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పొదలకూరు: మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి సోమవారం జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ వారు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన ఐతా కాశయ్య అనే గీత కార్మికుడు కల్లు గీస్తూ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి మరణించాడు. బాధిత కుటుంబానికి వారు సాయం చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోసూరు గోవిందయ్యగౌడ్ ఆశయ సాధనలో భాగంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్ పర్యవేక్షణలో నగదును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్, యువత అధ్యక్షుడు తాళ్ల రాజాగౌడ్, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న నాయకులు

ఎన్ఐఓటీని సందర్శించిన వీఎస్‌యూ ప్రతినిధులు


ఎన్ఐఓటీ డైరెక్టర్ తదితరులతో వర్సిటీ వీసీ

వెంకటాచలం: చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ)ని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, మెరైన్ బయాలజీ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎం.హనుమారెడ్డి, డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తదితరులు సోమవారం సందర్శించారు. ఎన్ఐఓటీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్, ఇతర అధ్యాపకులతో సముద్రంలో పరిశోధన, సాంకేతిక రంగాల్లో సహకారం తదితరరాలపై చర్చించారు. ఎన్ఐఓటీతో ఒప్పందం విద్యార్థులకు సముద్ర పరిశోధనలో అనుభవాన్ని పెంపొందించేందుకు సహాయ పడుతుందని వీసీ తెలిపారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం అత్యంత వైభవంగా లక్ష్మి హయగ్రీవ పూజను నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు పెండ్యాల రమణయ్యనాయుడు - విజయలక్ష్మి దంపతుల పర్యవేక్షణలో పూజలను జరిపించారు. త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో రుత్వికులు హయగ్రీవ యాగాన్ని నిర్వహించారు. పట్టణంలోని నాగార్జున, నారాయణ స్కూల్ విద్యార్థులు పూజల్లో పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నాం


మాట్లాడుతున్న సునీల్‌కుమార్

తోటపల్లిగూడూరు: దేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సీల్) అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటిస్తోందని కంపెనీ ఓఅండ్ఎం సునీల్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని అనంతపురంలోని కంపెనీ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన ఉద్యోగులకు బహుమతులను అందజేశారు.

రైతులకు అన్ని సౌకర్యాల ఏర్పాటు

కోవూరు: ధాన్యాన్ని విక్రయించేందుకు వీలుగా రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించామని సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ అర్జున్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం.. రైతు దైన్యం అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆయన స్పందించారు. రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధరలకు విక్రయించాలనేదే తమ లక్ష్యమని చెప్పారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం: పేదలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మహాయాగ ఫౌండేషన్ సేవలను బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అభినందించారు. బాలింతలకు పౌష్టికాహార కిట్లను మహాయాగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ పద్మజ, హాస్పిటల్ డెవలెప్‌మెంట్ కమిటీ సభ్యుడు కోదండరామిరెడ్డి, డాక్టర్లు వెంకటేశ్వర్లు, సహన, ల్యాబ్ టెక్నీషియన్లు రవితేజ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



సెల్ టవర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన

మనుబోలు: మండలంలోని చెర్లోపల్లి సచివాలయం వెనక వైపు ఓ ప్రయివేట్ కంపెనీకి చెందిన సెల్ టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామస్తులు సోమవారం సచివాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు దేవదానం మాట్లాడుతూ జనావాసాల మధ్య సెల్ టవర్ ఎలా ఏర్పాటు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం మనుబోలుకు వెళ్లి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కూటమి పాలనలో రైతులకు నష్టాలు


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: కూటమి పాలనలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లిగూడూరు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్ నూతన గృహ ప్రవేశానికి సోమవారం కాకాణి హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులు ఆదాయం పొందారన్నారు. నేడు దిగుబడులు ఆశించిన స్థాయిలో రాక, ధాన్యానికి గిట్టుబాటు ధర లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి పెద్దలు ఇచ్చిన హామీలు బూటకమేనని తేలిపోయిందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో నారాయణరెడ్డిపేట నుంచి తోటపల్లిగూడూరు వరకు ప్రధాన రోడ్లు నిర్మించడంతోపాటు పేడూరు, ఇస్కపాళెం, తోటపల్లిగూడూరు గ్రామాలకు సీసీ రోడ్లను నిర్మించి దశాబ్దాలుగా ప్రజలు పడుతున్న కష్టాలకు విముక్తి కలిగించానన్నారు. ప్రస్తుత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి కమీషన్లు, కలెక్షన్లతో కాలం వెళ్లదీస్తున్నాడన్నారు. గ్రావెల్, ఇసుక, మట్టి, బూడిద అక్రమంగా తరలిస్తూ అవినీతి సంపాదనకు పాల్పడుతున్నారని విమర్శించారు. కూటమి పాలనలో తెలుగు తమ్ముళ్లకు మాత్రమే మేలు జరిగిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజకీయాలకు అతీతంగా, పార్టీల ప్రమేయం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించారన్నారు. నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు, ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు మన్నెం చిరంజీవుల గౌడ్, తలమంచి సురేంద్రబాబు, ఈదూరు రామాచార్యులు, చెరుకూరు శ్రీనివాసులనాయుడు, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, తాని తిరుపతి, అన్నం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే


విజేత స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే


సరస్వతి పూజ

పొదలకూరు: పట్టణంలోని విజేత స్కూల్లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే, సరస్వతీ పూజను నిర్వహించారు. కరస్పాండెంట్ జి.కామాక్షి మాట్లాడుతూ విద్యార్థులు టెస్ట్‌లో మంచి మార్కులు సాధించాలని సరస్వతి పూజను నిర్వహించామన్నారు. యూకేజీ, 5వ తరగతి పిల్లలకు జ్ఞాపికలు అందజేశామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

➡ అమరావతి స్కూల్లో సోమవారం సరస్వతి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కె.సురేష్ మాట్లాడుతూ టెస్ట్ విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పూజలు నిర్వహించినట్టు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.